పెద్ద కథ:

# హాంబర్ సైకిల్ సూరీ అవిటికాలి సరోజా

యస్. యస్. శాస్త్రి

మూడు రోజులుగా నిద్రలేకపోవడం, నాలుగు వందల మైళ్ళ రైలు ప్రయాణం, యాభై మైళ్ళకి పైగా ఎంతకూ తరగని దూరాన్ని సావకాశంగా కబళిస్తూ "నడుస్తున్న" ఎక్స్‌ప్రెస్ బస్సులో కూర్చోవడం, రెండు ఫర్లాంగులకి మించి ఇసుకలో దిగబడిపోతున్న కాళ్ళు యీడ్చుకుంటూ యీసురోమని నడవడం, రేవు దాటుతూనే టపా బస్సులో టిక్కెట్ల కోసమని కాఫీహోటల్లో ఆసీనుడై బల్ల మీద "బుకింగాఫీసు" తెరిచిన కండక్టరుగారి చుట్టూ మూసిరిన జనంలో హైరానపడ్డం, ఆపైన మరో ఇరవై మైళ్ళైనా ఆ కోనసీమ గతుకుల రోడ్లంట ఊపిరాడని తొడతొక్కిడిలో "పెళ్ళిపందిరి"ని మరపించే "పెద్ద కారు"లో పడుండడం– అసలు గమ్యం చేరుకోగలనా అనే శంకగూడా నాలో తలెత్తింది. మొత్తానికి 'బండి' స్టాండులో ఆగేవేళకి వొళ్ళంతా హూనమైపోయింది నాకు.

కొన్నేళ్ళుగా ఈ రకం ప్రయాణాలు అలవాటు తప్పినందువల్లననుకుంటా కడుపంతా దేవుతున్నట్టుంది. తల దిమ్మెక్కి భారం కాసాగింది క్రమేపీ.

ఈమధ్య నా ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే వుంటోంది. ప్రతి చిన్న విషయానికీ విపరీతంగా గాబరాపడడం, అతిగా ఆలోచించడం, తత్పర్యవసానంగా తలంతా శూలాలతో పొడిచినట్టయి తల, కణతలు పచ్చి పుళ్ళయిపోవడం నా శరీర తత్వమే పూర్తిగా మారిపోయింది. నా జీవితానికి ఏర్పడ్డ ఆ అఘాతం నుండి నేనింకా బయటపడలేదు. నా వెర్రిగాని అసలది సాధ్యపడేదేనా అని! అదంత సుగమమైన అవాంతరమే అవట్లయితే ప్రఖ్యాత రచయితొకరెవరో వ్యంగ్యంగా చిత్రించిన ఆ "భావిపౌరుల" అడుగుజాడలలోనే నేనూ నడుచుకుని, రాధతో నా చెలిమినొక ఆటగా పరిగణించి. గతమొక పీడకలగా భావించి, నా బ్రతుకు బాటను పునరుద్ధరించుకుని, రంగుల కలను యదార్థం గావించుకుని సుందర నందన వనాన్ని సృష్టించుకునే వాడినే!

ఊహూఁ. అదిక నా వల్లగాదు. మోడువారిన ఈ జీవికకు వసంతం మరి రాదు. ఇన్నేళ్ళ ఈ నా జీవితమూ నిస్సారమై, నిరర్థకమై చివరికి తీరని దుఃఖాన్నే మిగిల్చి పెట్టింది నాకు. నిస్పృహాయుడిగా పట్టుగొమ్మ దొరకని మహా ప్రవాహంలో తలమునకలౌతున్న నన్ను ఒడ్డు చేరనీక సుడిగానికి విసిరివేసింది.

బస్సు దిగుతూనే ద్రాక్షారంలో తిన్నదంతా వాంతి చేసుకున్నాను. నోరంతా అసహ్యంగా వుంది. కళ్ళు పచ్చబడి పరిసరాలు కనబడ్డం మానేశాయి.

'అరెరె! అట్టుగో రేంటెహే!!' అబ్బాయిగారడి పోతంటేనే?" అంటూ కండలు తిరిగిన నల్లటి మనిషొకతను నాగలి కింద పారేసి వచ్చి నన్ను పట్టుకుని వుండకపోతే ముందున్న మైలురాతిపై పడి నుదురు చిట్లిపోయేదే. అతడే నన్ను నడిపించుకెళ్ళి, కిళ్ళీకొట్టు ముందు బల్లపై కూర్చోబెట్టి. చేతికి జింజరు సీసా అందించి పాగా గుడ్డతో విసరసాగేడు. చుట్టూ చేరిన జనం ఎవ్వారు. ఎవరంటికి అని ప్రశ్నలతో వేధిస్తుంటే 'లెగుండెహే! కూంత గాలి తగ్లనీరేటి ఆరికి?' అంటూ మళ్ళా ఆ మనిషే జనాన్ని తప్పించి వెలుతురికి ప్రవేశం కల్పించేడు. నాగలిని వేలాడదీసిన అత్రం తుంపి పోతకల్లాటి నాలుగు చక్రకేళీలు నా చేతుల్లో పడేసి "చెక్కరకేళీ అంటి పళ్ళు రొండు తిన్నారంటే నా సామే, ఎక్కడ్దోగాలక్కడికి వూస్ మాంకాళీ అని యెగ్గిరిపోతయ్" అంటూ నవ్వుతూ పాగా గుడ్డ దులిపి తలకు చుట్టుకున్నాతతగాడు. కాస్త తేరుకున్న నేను కృతజ్ఞతా భావంతో చూశానతడి వంక. అతడి కళ్ళలోని ఎర్ర జీరల నడుమ "మా గోదావరి తల్లి మహిమ నీకేం తెలుసు?" అని ధిక్కరించే గర్వపు ఛాయలు పొడజూపినయ్.

జింజరుకి చిల్లర యిచ్చేసి ఆ రైతు మనిషి చేతిలో అర్థరూపాయి బిళ్ళ పెట్టబోయేసరికి అతగాడు "యేటిదీ, పట్టంనుంచేటి రావడం! ఉంచండి బాబోరే" అని బిగ్గరగా నవ్వుతూ అక్కడున్న వాళ్ళకి నన్ను చేయెత్తిచూపిస్తూ, వుగాక్కాడ సాపు చేసుకుంటూ వెళ్ళి నాగలి భుజాని కెత్తుకున్నాడు. ఏమిటీ వింత ప్రవర్తన! ఇచ్చింది చాలకపోతే ఇంతివ్వమని అడగటం పోయి ఏమిటీ లౌక్యం! ఇంతసేపూ నా కతడు చేసిన ఉపచారం చూసన్నా అడిగిన ప్రతిఫలం యివ్వకపోదునా! ఇదీ ఆ గోదావరి మహాత్మ్యమేనా! నాకు తల కొట్టేసినట్టయింది.

అసలంటూ దొరికితే మెడ్రాసులో పండు పావలాకి తక్కువుండదు. పోనీ మరో రూపాయిస్తే పోయె!– ఎంతో శాక్రిఫైస్ చేస్తున్నట్టు ఫీలవుతూ రూపాయున్నరా చేతపట్టుకుని అతణ్ణి వెనక్కి పిలిచేను. పోయిన మానం తిరిగితోడుకుందుగ్గాను! నా అంచనా సరైనదే. భుజాన నాగలితోబాటే నన్ను సమీపించేడా రైతుమనిషి. సమీపించి. "బాబూ దర కడతన్నారేటి? డబ్బుతో యేదన్నా యెలకి కొనేసేయొచ్చనుకుంటున్నారా! ఎంత సంపాయిత్తే యేంటి? ఎంత సదూకుంటే యేంటి? డబ్బియ్యాలొత్తది. రేపోతది. అదే అవుతలోరికెవురికన్నా సాయం సెయ్యండి. అవుతలోళ్ళు సంతోసించే పన్జేస్తూ వుండి! అద్దదీ నిలిసేది! అప్పుడే మనసు పల్లగా అవుద్ది! మెదబోలు బావపడకండా మసులుకోవాల్ని నేన్జెప్తే మీ లాటోరు తెలుసుకోవలసింది గాదు బాబూ, మరి సెలవిప్పించండి. వత్తా" అని చెప్పేసి– కాదు హితబోధ చేసి – పగుళ్లు దీసిన పాదాలతో, బురదల్లో జారకుండా వుండడానికి నొక్కి నడవడం వలన కాబోలు బయటివెంపుకి బాణంలా వంగిన ఆ బొటనవేళ్ళతో, పెద్ద పెద్దఅంగలు వేస్తూ చుట్టకోస కొరికి ఉమ్మేస్తూ వెళ్ళిపోయేడు అతగాడు.

నోరు తెరుచుకుని వింటున్న నేను "ఈ మాత్రానికి యిక్కడ్దొకళ్ళెవరూ డబ్బులిచ్చుకోరు బాబయ్యా!" అన్న కిళ్ళీ కొట్టు వాడి మాటలకి ఉలిక్కిపడి ఇటు తిరిగేను. పెద్ద చదువులు, పట్నవాసపు నాగరికత, ఉద్యోగమిచ్చిన హోదా, డబ్బు కలిగించిన పొగరు, – యివన్నీ కలిసి పడుగు పేకలై అల్లిన నీలితెర వటాంచలై స్వచ్ఛమైన, పరిశుద్ధమయిన మానవత్వపు కాంతి రేఖలు దృగ్గోచరమైనాయి నాకు. ఇంతవరకూ నన్నాక్రమించుకొని వున్న రుగ్మత మాయమై హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఈ తాత్కాలిక స్వాస్థ్యానికి కారణం ఆ రైతు మనిషి ఉపచారం ఒకపాలైతే, శ్రవణపేయమైన ఆ నా భాష, రంగులు పూయని ఆ 'పచ్చి' ఆప్యాయతా మిగతా మూడు పాళ్ళూను.

సూట్ కేసుతో రిక్షాలో కూచున్నాను. ఒక చేత అభయముద్ర ధరించి, రెండవ చేతిని కాస్త వయ్యారంగా "ఆలా" కిందకి పెట్టుకుని నుంచునివున్న ఒక సుందర దేవతామూర్తివలె సెంటరులో అతి ఫ్రీగా నుంచుని 'సైడు' ఇచ్చేసిన 'పోలీసు బాబు' ని దాటుకుని, యిరుకైన ఆ బజారువీధిన మా రిక్షా రయ్యమని దూసుకుపోయింది.

• • •

రిక్షా గుమ్మంలో ఆగేసరికి ముందువాటా రఘుపతిగారి తల్లి కళ్ళపైన చేయి అడ్డంపెట్టుకు పరీక్షగా చూసి. అనవాలుపట్టగానే ఇంత ముఖం చేసుకుని అరుగు దిగొచ్చారు. వస్తూనే. "ఏం సూరిబాబూ. అమ్మ పోంగానే ఊరే గొడ్డోయిందనుకున్నావా యేం ? మేమొహళ్ళం బతికున్నామన్న మాటే మర్చిపోయావా ?" అంటూ నిష్టూరాలాడేరు. వత్తిగింజల్లాంటి మామ్మగారి కళ్ళలో తడి నన్ను సిగ్గుతో కుంగదీసింది. వసూళ్ళయిన అద్దెలూ, శిస్తులూ పంపినప్పుడైనా రఘుపతిగారి పేర ఒక్క కార్డు ముక్కకూడా రాసి యెరుగని నా తప్పిదం చిన్నదీ చితకదీనా! ఏటికో ఏణ్ణార్థికో పట్టు బలవంతంమీద తప్ప కోనసీమ రాని నన్ను మామ్మగారలా అటగడంలో తప్పేముంది! మామ్మగారికేం సమాధానమీయగలను !

దోషివలె దృష్టి పక్కకు మరల్చుకున్నాను. అక్కడ అరుగుమీద సింహద్వారపు గడపవతల నీలి రంగు వోణీ, బుట్టపూల పరికిణీ కనిపించి తలెత్తిన నాకు రెండు సుపరిచిత నేత్రాలు మిలమిలలాడుతూ మెరిసి తృటిలో మాయమైనాయి. ప్రశ్నార్థకంగా మామ్మగారివంక చూసేను.

ఆడా వేళ్ళ సందుల్లోంచి కళ్ళు చిట్లించి చూస్తున్నదానలా నాకేసి తిరిగి నవ్వుతూ. "దాని సిగ్గు చెక్కలాయిరి ! నీతో సైకిలెక్కి ఊరేగినప్పుడేమయిందో యీ సిగ్గూ లజ్జానూ!" అనేసరికి ఆశ్చర్యపోతూ "ఎవరూ...సరోజా!" అన్నాను.

"యిహనెవరూ ? ... అదే! లోపలికి పద బాబూ అంటూ అరుగుపైకి నడిచేరు మామ్మగారు.

విస్తుపోయేను. అప్పట్లో పదేళ్ళ పిల్ల సరోజ. ఆ కుడి కాలు ఊ యెగరేసుకుంటూ, ఆనందమంతా నా సొత్తు అన్నట్టుగా విశ్వంతగా తిరుగాడే ఈ సరోజనే నేను రవణం వారి వీధి చివరి గరల్స్‌స్కూల్లో దింపి హైస్కూలుకి పోతుండేవాడిని. సైకిలు అరుగు దింపగానే వచ్చి వొంటికాలితో ఒక్క యెగురులో వెనకాల యెక్కి కూర్చుని. "టైమైపోతోందంటే నీక్కాదుటోయ్? వొంటెద్దు బండిలా పోనిస్తావేం! జీతం పడకడం ఒక్కటి మట్టుకి నేర్చుకున్నారు బాగా!" అని ఆజ్ఞాపిస్తూ. నాకు కోపం తెప్పిస్తూ. మెదడు ప్రేరేపణకి ఏ మాత్రమూ కట్టుబడని ఆ వ్రేలాడే కాలిని ఎడం కాలి పై "వదేసుకుని మహారాణిలా కూర్చుని స్కూలు చేరువయే పర్యంతమూ వసపోసిన పిట్టలా వాగుతూండేది. సరోజ నిముషం కాలు నిలువకుండా ఆ ముందున్న కాంపౌండుగోడ ఆర్చిలమీంచి కిందికి దూకుతూ. "ఆ రెండో కాలు కూడా విరగ్గొట్టుకుంటావుటే" అని మొత్తుకునే పెద్దవాళ్ళ అరుపులను లక్ష్యపెట్టక. జలపాతపు ఉధృతంతో. సెలయేటి వేగంతో గలగలా సాగిపోయేది ఈ సరోజే సన్నని ఆ కుడికాలిని వెనుకకు మడిచి మెలిత్రిప్పి వొడి మీదుగా· ఎడమ పక్కకి రప్పించే సరోజతో అలా చేయలేని నేను ఆ పందెంలో ఎప్పుడూ ఓడిపోతూండేవాడిని. ఎలా పడితే అలా ఆ కాలిని చుట్లు తిప్పుతూ రకరకాలా "ఫీట్సు" చేసేది ఈ సరోజే.

ఆ చిన్నతనం. బాధ్యతారహితమైన ఆ రోజులు. "హంబర్ సైకిలు సూరి. అవిటికాలి సరోజా" అనే స్నేహితుల అవహేళన. బినా సరే సరోజకి "లిఫ్ట్" యివ్వడం మానని నా పట్టుదల గోదావరి తల్లి పొంగి ఊరూ వాడా ఏకం కావడం. ఎక్కడో గండి పడిందంటె మరెక్కడో వంతెనే మునిగిపోయిందని విని గణపతీ నేనూ సైకిళ్ళేసుకుని ప్రయాణమవడం. మేమూ వస్తామని ఇటు సరోజ అటు రాధ పేచీ పెట్టడం. నలుగురం పోయి ప్రవాహంలో కొట్టుకొచ్చిన శవాలనూ పడగలు ప్రవాహం పైకి ఎత్తుకుని ఈదే త్రాచుపాములనూ. మా ఎట్టఎదుటనే మట్టిగోడలు నాని పెట కరిగిపోయే దరిద్ర నారాయణుల తాళపత్ర "భవంతులనూ సంభ్రమాశ్చర్యాలతో చూడడం. పెచ్చుమీరిన భయంతో నా చెయ్యి నలిపివేస్తూ సరోజ. వింతకు మరీ విశాలమయిన విశాల నేత్రాలతో రెప్పవాల్చక చూస్తున్న రాధ ..నా ఆలోచనలు స్టేషను సమీపించే రైలుబండిలా క్రమేపీ వేగం తగ్గి స్తంభించిపోయేయి.

రాధ !

ఏదీ నా రాధ ? ఎక్కడుంది ??

ఇంకెక్కడి రాధ !...నా దురదృష్ట జాతక ప్రభావం వల్లనైతే నేమి. నా అసమర్థపు వ్యక్తిత్వం కారణంగానైనా వృథా కాలయాపన వల్లనైతేనేమి ఆరేళ్ళనాడే పరాయిదయి పోయింది రాధ. ఆ నాడే నేను నిజంగా లేను. భౌతికంగా బ్రతికే వున్నా నా హృదయం మూగదై పోయింది. మనసు మరణించింది— సరిగ్గా ఆ నాడే ! జీవచ్ఛవంలా తిరుగాడుతూ రోజులు వెనక్కుతోసుకుంటూ కాలం గడుపుతున్నాను.

బహుశః తన పంతం నెగ్గిందనే పరిపూర్ణ తృప్తితోనే నాన్నగారు ప్రాణం వదలివుంటారు నాలుగునెలలూ తిరక్కుండానే !

ఏడాది గడవకముందే అమ్మ నాన్నగారి దగ్గరకు వెళ్ళిపోయింది. అమ్మ పోగానే ఆ వూరు వదిలి ఈ పరిసరాలకీ, ఈ వాతావరణానికీ దూరంగా పారిపోయి రాధను గురించిన జ్ఞాపకాలను అణచివేద్దామనే పిచ్చి తలంపుతోనే మద్రాసు వెళ్ళి అక్కడే స్థిరపడిపోయేను. మళ్ళీ సరిగ్గా ఏడాది పూర్తయేసరికి రాధ వొళ్ళంటించుకుని బలవన్మరణం పాలైందనీ. విఫలమైన ప్రేమ: తాళిగట్టిన మేనమామ పెట్టే నరకయాతనా కారణాలని తను పూర్తిగా నమ్ముతున్నాననీ. "సూయిసైడ్" అంటూ కేసు బుక్ చేసిన పోలీసు వాళ్ళకి వంటజేసుకుంటుండగా ప్రమాదవశాన బట్టలంటుకున్నందువల్లనే రాధ చనిపోయిందనీ. ఆత్మహత్య కాదనీ "ఒప్పించి" కేసు మాఫు చేయించడానికి నాలుగువందలు వదిలినట్లూ. తానిక పెత్తండ్రిగారివూరు వెళ్ళిపోయి అక్కడే పౌరోహిత్యాలు చేసుకు రోజులు వెళ్ళదీయ సంకల్పించినట్లూ గణపతి దగ్గర్నుంచి ఇంత పొడుగు ఉత్తరం వచ్చింది. నాలో లావా ఉబికి వచ్చినట్టయింది... ఆనాటితో నాక్కూడా ఈ వూరితో శాశ్వతంగా ఋణం తీరిపోయినట్టే భావించేను. ఆవిధంగానే ఈ నాలుగైదేళ్ళలోనూ






ఏ రెండుసార్లో, అదీ రఘుపతిగారి పట్టుమీద, రావడం ; ముళ్ళమీద వున్నట్టు రెండురోజులాగి చక్కాపోవడం— ఇప్పుడుకూడా "నన్ను చూడా లని కాపులంతా ఎంతో యిదవుతున్నారనీ, సంవత్సరానికోసారన్నా ముఖం చూపించకుంటే రైతులు పేట్రేగిపోతారనీ, పెద బ్రాహ్మణ్ణైన

# హంబర్ సైకిల్ సూరీ అవిటికాలి సరోజ

తనపై ఇంతింత. ఆర్థిక వ్యవహారాలు మోప డం తనకో శిక్షగా భావిస్తాననీ, పైగా అది ఉభయులకీ కూడా అట్టే శ్రేయస్కరం కాదనీ" ఇంకా ఇలాగే ఏమైనాసరే నన్ను ఇక్కడికి రప్పించాలని రఘుపతిగారు వ్రాసిన సుదీర్ఘమైన ఉత్తరమే కారణం నా ఈ రాకకు. పైగా ఎంత ఈ ఊరికి దూరంగా పారిపోయినా మనసు నా అధీనంలో లేకుండాపోయింది. ఎంత ప్రయత్నించీ దానిని కట్టడిచెయ్యటం చేయలేకపోయాను. ఏదో తీరని వెలితి, ఆవేదన, అసంతృప్తి నాలో నాకు తెలీకుండానే వేళ్ళు నాటుకుని దినదిన ప్రవర్థమానమై మహా వృక్షంలా వ్యాపించి నన్ను క్రుంగదీస్తున్నాయి. కాస్త స్థలం మార్పు జరిగితే ఏమన్నా ప్రశాంతత లభిస్తుందేమోననే ఆశతో, కనుపించని దేనినో వెతుక్కుంటూ ఇన్నేళ్ళకి మళ్ళా ఒక నెలరోజుల సెలవుపై ఈ వూరువచ్చి పడాను ఆవురావురుమంటూ.

...ఏ పని చేస్తున్నా ఏదో లోటు. ఎందు గురించో ఆలోచన, పరధ్యానం...

"ఏమిటి సూరిబాబూ ఇక్కడే నుంచుండిపోయేవు?" అని మళ్ళీ వచ్చి అడుగుతున్న మామ్మగారి ముఖంలో ఆశ్చర్యం గుర్తించి కంగారుగా "ఆఁ వస్తున్నా పదండి, మేడ తలుపులు తెరిచి" అంటూ సూట్‌కేస్‌లోంచి తాళాల గుత్తి పైకితీశాను.

* * *

వీధి వెంపు మేడమెట్లెక్కుతున్న నన్ను కంగారుగా చూసుకుంటూ అరిచాను మేకలు కింపికి పరుగెట్టేయి పహతూ లేస్తూ. మెట్లన్నీ నానా ఛండాలంచేసి పెట్టేయి. ఒకటే దుర్వాసన.

తాళంతీసి లోపల అడుగు పెట్టగానే బూజులు గట్టి దుమ్ముకొట్టుకుపోవున్న "ఆఫీసు సావిడి" నా ముందు సాక్షాత్కరించింది. ఈ తలుపులు తెరచి రెండేళ్ళు దాటుతోంది!

దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది నాకు. ఇదివరలో ఏనాడూ రాత్రి పన్నెండుకి ముందు గాని, తెల్లవారుఝామున నాలుగ్గంటల తరువాత గాని ఈ యింటి తలుపులు మూసి ఉండేవికావు.

ఇల అంతా శూన్యంగా, దిగులుగా బావురు మంటున్నట్టుంది.

ఒకప్పుడు ఇదే యిల్లు ఇంబెడు జనంతో, దాస దాసీలతో, వచ్చే పోయే బంధుమిత్రులతో విందులూ వినోదాలతో, సుఖసంతోషాలకు పుట్టినిల్లై విలసిల్లినది. ఈ నాడు నేను తప్ప రెండో ప్రాణి ఇందు అడుగిడడానికూడా లేదుకదా! ఎంత మార్పు!

కాలచక్రం ఎంత వేగంగా ఎన్ని కొత్త వుంతలు వయువిస్తోరిది!

రాజప్రాసాదంవంటి ఆ యిల్లు— అందు దర్బారులా నాన్నగారి "ఆఫీస్సావిడి" నాన్నగారు లేరు. ఆఫీసులేదు. ఐనా, అదెన్నటికీ ఆఫీస్సావిడే!


నాన్నగారు బతికున్నరోజుల్లో సావిడినిండా కుర్చీలు, బల్లలు చాపలు, తివాసీలు. వాటినిండా 'క్లయింట్లు'. గోడదాపున పెద్ద పెద్ద బీరువాలు బీరువాలు నిండిన "లా" పుస్తకాలు. "లా" జర్నల్సు. హాలుకి దక్షిణాన "రికార్డు రూం". అందొక వార "సీలింగు" నంటుతున్న "రేక్స్" నిండుగా దస్తావేజుల కట్టలు. వాటి పుటలలో న్యాయార్థులై వచ్చి నాన్నగారి ప్రజ్ఞాపాటవాలపై భారం మోపి ఆతురతతో ఎళ్ళతరబడి నిరీక్షించే అమాయకపు వంచితజీవుల కుటుంబ గాథలు. గుమ్మం ఎదురుగా టేకు సందుఖా పెట్టెలవద్ద వ్రాతబల్లలతో ముగ్గురు గుమస్తాలు.

"పార్టీలతో" కిటకిటలాడే రాజ దర్బారు వంటి ఆ పెద్ద హాలులో నడుమనొక సింహాసనాన్ని పోలిన పెద్ద యినుప వాలుకుర్చీ. అందులో చేరగిలబడి, కాళ్ళు ఆ పొడుగాటి కుర్చీ "మడత చేతుల" పై బారజాపుకుని, సింహగర్జనవంటి నవ్వుతో, పుష్యమాసపు వరిచేలలా వెనుకకు వాలి: పసుపులోంచి తెలుపులోకి "విరిగే" రంగుతో చెదురు మదురుగానున్న గుప్పెడు వెంట్రుకలతో రాజదర్పంతో ఒప్పే నాన్నగారు!

కోర్టులో బెబ్బులివలె ప్రతికక్షిదార్లను బెదరగొట్టించిన "పెద్ద ప్లీడర్లు" నాన్నగారు!

ఇంటఁ గెలిచి రచ్చఁ వెలిగిన నాన్నగారు!

ధర్మరాజు, దయాళువు అని పేరు గడించిన నాన్నగారు ఇంట ఆలుబిడ్డలకు సంబంధించిన మేరకు యమధర్మరాజు, దూర్వాసుడు, చండశాసనుడు. ఒక్క మాటలో చెప్పాలంటే వాయుదేవుడుకూడా ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా దిశ మార్చుకోవడానికి సాహసించేవాడుకాదు.



డిజైన్: బి. ఎ. లలిత. (కరీంనగర్)

అటువంటి నిరంకుశత్వంలో నలిగి నరంలా ఎండిపోయిన వ్యక్తి అమ్మ!

అదే అమానుషత్వం నా జీవితం సారహీనంగా చేసి, నా బ్రతుకు నిరర్థకంచేసివేసింది. నా ప్రాణాన్ని, రాధను, నాకుగాకుండాచేసి; ఇరవైయేళ్ళ నిండుయవ్వనంలో ఆ అబల ఆత్మహత్యకు పాల్పడేలాజేసి; నన్నొక జీవచ్ఛవంగా మార్చిన ఘనత సాక్షాత్తూ నాన్నగారిదే!

ఆ నాదంబ్రడిసభలా వెలిగిన ఆఫీస్సావడి ఇప్పుడు తప్పెడు దుమ్ములో మునిగి తేలుతుండ సింహాసనంవంటి ఆ పెద్ద యినుప వాలుకుర్చీ మూలబడ్డ ముత్తైదువలా, చరిత్ర వినా మరేం మిగలని గత రాజ్య వైభవాలకి చిహ్నమైన శిధిల శిల్పంలా, బ్రతికిచెడినవాడి వదనంలా, దిక్కుమాలిన కుక్కలా కాళ్ళు విరిగి, కీళ్ళడిగి తుప్పుపట్టి, ఛిన్నాభిన్నమై నిర్జీవంగా పడివుంది హాలుపక్క రికార్డు రూం" లో!

కాలధర్మాన్ననుసరించి గాలిలో కలిసిన నాన్నగారి ఊపిరి వికృతంగా, భీకరంగా, కర్కశంగా మూలుగుతోంది నన్ను చూసి...... తెలీని భయంతో ఒడలు జలదరించింది ఒక్కసారి.

హాలుగోడని అంతెత్తున నాన్నగారి ఫొటో— ఆ పక్కన ఏడాది తిరక్కుండానే ఆయన్ను చేరిన అమ్మ ఫొటో—

శోభతరిగి కళ నశించి వెలుతురికి నోచుకోని ఈ యింటిని చూడలేం బాబూ మేం చూడలేమన్నట్టు రెండు ఫొటోలూ ఆసాంతం దుమ్ముతో కప్పబడి ఉన్నయ్!

—వెనుక వెంపు మెట్ల తలుపు చప్పుడవడంతో వెళ్ళి తెరిచేను.

ఇల్లు కడిగి ముగ్గుకళ్ళలు తీయమని పనిమనిషికి పురమాయించి "వొచ్చి స్నానం చెయ్యి సూరిబాబూ, భోంచేద్దూగాని — ఏ వేళప్పుడు తిన్నా తిండో" అంటూ కిందకి వెళ్ళిపోయేరు మామ్మగారు. నిజమే, చాలా నీరసంగా ఉంది,.. టవలు, సోపు తీసుకుని మెట్లు దిగేను.

* * *

కమలమ్మగారు— సరోజ అమ్మగారు— చెప్పడంతో వచ్చి విస్తరిముందు కూచున్నాను స్నానమవగానే. మామ్మగారు నా పక్కనే కూచుని ఆప్యాయంగా, ప్రేమగా, అభిమానపూరితమైన పలకరింపులతో కొసరి కొసరి వడ్డిస్తున్నారు. నాకిష్టమని సరోజ జ్ఞాపకం చేయగా, రొట్టెల నారాయుడి మనవడిని అమ్మవారి గుడిదగ్గర కంపి తెప్పించిన నవనవలాడే వంకాయలతో 'కారంపెట్టి కూర' వండేరుట కమలమ్మగారు. ఎంతో 'ఆబగా' తిన్నాను.

వంటింటి గుమ్మంలో పీలి వోణీ కటకటాల్లోంచి వీచే చిరుగాలికి సన్నగా కదులాడుతూ ఎట్టి పూల పరికిణీతో పరాగాలాడుతోంది.

ఇలా పీటమీద కూచున్నానో లేదో రఘుపతిగారు వచ్చి పలకరించి వెళ్ళిపోతూ "ఈ ఊళ్లో ఉన్నన్నాళ్ళూ మరోయింట విస్తరేస్తే నే నొప్పు

వాయ్." అని హెచ్చరించేను. ఈ ఆదరాభిమానాలకి ఉక్కిరి బిక్కిరౌతున్నాను నేను.

అమృత తుల్యమైన ఆ భోజనం. కొన్నేళ్ళుగా నాకు కరువైన ఆ అప్యాయత. ప్రేమానురాగాలు కట్టలు తెంచుకు ప్రవహించే ఆ వాతావరణం. ఆ వ్యక్తులు — ఎంతో హాయిని పంచింది. అందువల్లనే ననుకుంటా అమ్మరూపం హఠాత్తుగా నా మనసులో మెదిలింది.

తింటూ తింటూన్నవాడిని ఆ తర్వాత ముద్ద మింగుడుపడటం మానేసింది. గతించిన వ్యక్తుల జ్ఞాపకాలేర్పరచిన దిగులు గొంతులో ఘనీభవించినట్లైంది. మంచినీళ్ళు తాగేను. తగ్గలేదు. బాధ మరింతైంది.

నా పరిస్థితి గ్రహించినట్టే అన్నారు మామ్మగారు. "చూస్తూండగానే ఇట్టే అయిదేళ్ళయిపోయింది అమ్మపోయి. చూసేవా! మహాయిల్లాలు. లక్ష్మిలా మనిషిలే! పసుపు కుంకాలతో పోతిపోతినే అని అల్లో లక్షణా అంటూ ఏడుస్తూ కన్నుమూసింది. నీ చదువెప్పటికి పూర్తవుతుందో, ఎప్పుడు వో యింటివాడివౌతావో, నీ పెళ్ళి తలపెడితే అదా 'అలా' అర్ధాంతరంగా పోయిందాయిరి అని ఈ యిద్దవుతూందేది పాపం — బదేళ్ళవకపోవడమేం! ఒనే కమలా. సరోజమ్మ స్కూలుఫైనల్ పేసయ్యిందని సర్వాపురంపించి ఈ వేళ ఉత్తరమొచ్చింది. రేపొద్దున్న సరస్వతమ్మకి ప్రాణమీదకొచ్చింది! — ఉ గేపకం లేదుటే, మాటాడవూ?"

"ఆఁ ఆఁ గేపకం లేకనేం! బదేళ్ళం ఇంకా పైమాటే!" మూలుగుతూ గొణుగుతున్నట్టున్న సన్నటి గొంతుతో కమలమ్మగారు సమాధానమిచ్చేరు.

నాకూ గుర్తుంది కమలమ్మగారికి మగపిల్లవాడొకడు పుట్టి ఇరవయ్యొకటో రోజున బారసాల పీటలమీదే ప్రాణం వదిలేడు. ఆ దుర్ఘటనానంతరం ఆవిడ మంచమెక్కేరు. ఇక్కడ కుదరక విశాఖపట్టణంలో ఏణ్ణర్ధం పాటు వైద్యం చేయించాల్సి వచ్చింది. దాంతో రఘుపతిగారు చాలా దిగజారిపోయేరు ఆర్థికంగాను, మానసికంగానూకూడా. అసలే నెలకి పందకి మించని ఆదాయం— అప్పుడే. ఉన్న ఒక్కగానొక్క పిల్ల సరోజకూడా భారమై కమలమ్మగారి పుట్టినింటికి పంపించేసి అక్కడే చదివిస్తున్నారు. అమ్మ పోయే నాటికి నాలుగేళ్ళుగా నరసాపురంలోనే వుంటోంది సరోజ.

ఇంతలో మామ్మగారు "నా వడ్డన మంచినట్టే వుంది. ఉ. ఆ ఉల్లి ఆవకాయిలా వ్యటాకూడమటే పిల్లా. సంధ్యవేళ వొంటెంకిలా గుమ్మాన్నట్టుకు వేళ్ళాడకపోతేనూ?" అని కేకేసేరు. ఆవిడ కమలమ్మగారినీ "పిల్లా" అనే పిలుస్తుంటారు ఒక్కోప్పుడు.

తలొంచుకునున్న నా దృష్టి అంచులనుంచి ఎర్రపూల పరికిణీ ప్రవేశించింది— నెమ్మదిగా అటూ ఇటూ ఊగిపోతూ, మాటిమాటికీ ఓ ప్రక్కకి తిరిగిపోయే ఆ "ఎదగని" కాలిని కూడదీసుకుంటూ, తొడపైన చేయిమోపి నిలబెట్టుకుంటూ, డొక్కలోకి పొడుచుకొస్తూ ఆ పెద్ద ఎముక పెట్టే బాధకు పక్కలు నొక్కుకుంటూ, వచ్చి గుమ్మడికాయ ఆకారంలోవున్న జాడీని మామ్మగారిపక్కన పెట్టింది సరోజ. వంగేటప్పుడు పైటనొక చేత్తో అదిమి పట్టుకుంది కాని ఆ పొడుగాటి నల్లనిజడ ముందుకి పడి విస్తరిని ముద్దుపెట్టుకుంది.

పమిట దోపుకోమని ఎన్నిసార్లంట చెప్పేది! తిడితే తిట్టిందంటావుగానీ. భయమూ భక్తీ ఉన్నాయాంట పెదముండ చెప్తోందని! ఈ ఘటం హరీమన్నా అనాలి. — ఆ పిల్లది ఆ రోగమంటూ అసలుంటే అత్తారింటికన్నా పోవాలి— అప్పుడుగాని నా పోరూ తప్పదూ. నా నోరూ పూరుకోదు. ఆ "మామ్మగారు సరోజ వెంపూ నా వెంపూ చూస్తూ అన్నారు గబగబా.

సరోజ ముఖంలోకి చూసేను. తనూ నావంకే చూస్తోంది. ఆ చూపులో నిండిన వేదన నన్ను విచలితుణ్ని చేసివేసింది. ఆ ముఖంలో గూడు కట్టుకొనివున్న విషాదం వాలో సమస్యలు రేపింది. ముఖమంతా చెమటలుపోసి తడిగా వుంది. ఆ కాస్త దూరం నడవడమే సరోజకి ఎంత శ్రమతో కూడుకొన్నదో స్పష్టమౌతోంది. మామ్మగారి మాటలకి చట్టున తల పక్కకు తిప్పేసుకుని నెమ్మదిగా అక్కడినుండి కదలడానికి "ప్రయత్నం" ప్రారంభించింది!

నా యెదుట వుంచున్న ఈ నా చిన్ననాటి నేస్తం తనూ అందరు ఆడపిల్లలాగ తీయటి కలలు కంటూంటుంది కాబోలు! తన ఈడు అమ్మాయిలందరివలె తనూ హొయలు చిందిస్తూ వయ్యారాలొలకబోసుకుంటూ, అందాలు చిరజిమ్ముకుంటూ, మన్మథ పతాకంవంటి ఆ పైట సర్దుకుంటూ, పదుచు రక్తాలను పొంగులెత్తిస్తూ, సన్నని ఆ నడుము సుతారంగా తిప్పుకుంటూ పాములాటి బారుజడ పిరుదులపై నర్తిస్తుండగా, పరికిణీ కుచ్చెళ్ళు ఓ పక్కకి ఒత్తిగించి నాజూకుగా నడవాలని ఈ అవిటికాలి నేస్తం సరోజకి మనసుగా ఉంటుందికాబోలు! మిడిమిట్లుగొలిపే ఆ సౌందర్యాన్ని చూసి లొట్టలువేస్తూ, అదే వ్యక్తులు అసహ్యం, వికారంగా మెలితిరిగిపోయే ఆ పాదాన్ని, పుల్లలాటి ఆ కాలిని చూసి పెదిమలు చప్పరించి, నిట్టూర్పులు విడుస్తూ పనికిమాలిన సానుభూతి వ్యక్తంచేస్తుంటే ఈ నా నేస్తురాలు హృదయ విదారకంగా విలపిస్తూంటుంది కాబోలు! భగవంతుడా, ఎంత కఠినాత్ముడవయ్యా!!

ఏదో చప్పుడవడంలో ఉలిక్కిపడి తలెత్తాను.

కాలు మడతడిపోయినట్టుంది. వంటింటి గుమ్మంలో కుప్పలా కూలబడిపోయింది. సరోజ అనాలోచితంగా చట్టున లేవబోయేను. అంతలోకే ద్వారబంధాన్ని ఆసరాగాచేసుకుని లేచి, పక్కకి తిరిగిన పాదం ఊగులాడుతూండగా ఒక్క అంగలో అదృశ్యమైంది.


నా గుండెల నెవరో బలంగా పిండుతున్నట్లైంది.

"నువ్వు తిను బాబూ, కొత్తేముంది!" అన్న మామ్మగారి మాటలలోని బరువు నాలో ఆలోచనలు కదిపింది. కమలమ్మగారు పైటకొంగు నోట్లో కుక్కుకున్నారు. ఆవిడ కళ్ళు వర్షించనారంభించేయి. అవతల గదిలో సరోజ వెక్కివెక్కి ఏడవడం వినిపిస్తోంది.

ఈ హఠాత్సంఘటనకి అచ్చెరువందేను. ఒక్క క్షణంలో ప్రశాంతత స్థానే గంభీర వాతావరణం అలుముకొంది. నేను చూస్తుండి కాక మరేదో ఆ యింటి మనుషుల మనసులను పట్టి పల్లార్తుస్తోందని గ్రహించగలిగేను. కేవలం సరోజ నా యెదుట కాలు మడతడి పడిపోవడమే దీనికంతకీ కారణమనుకుందామంటే నేను కొత్తవాడిని కాను, సరోజకి అవకరమూ నిన్న మొన్న వచ్చినది కాదు. దానికింత ఏడుపులూ అనవసరమే...కాదు... మరేదో వుంది ఏదో వుందింకా...

ఇదే అప్పట్లోనయితే చెంగున లేచి, ఆ సన్నని కాలినె ఊతంగా ఊపుకుంటూ, గెంతుకుంటూ పరుగెత్తుకు పోయేది పగలబడి నవ్వుతూ. అసలు తనలో ఒక అవకరం ఉన్నదన్న గ్రహింపే లేనట్టు తుళ్ళుతూ పేలుతూ తిరుగాడుతూండేది. కాని...ఇప్పుడు...ఈ యీడొచ్చిన సరోజ "అలా" ఎలా నిశ్చింతగా ఉండగలదు?

పెద్దవాళ్ళం ఎందుకౌతామో కదా! మనిషికి బుద్ధినిచ్చి, ఈ మెదడుకు ఆలోచనా శక్తి ప్రసాదించి మవ్వేం బావున్నావయ్యా పరాత్పరా! మెత్తనయే మనసునిచ్చేవు. కరిగి నీరయే హృదయాన్నిచ్చేవు. ఇక ఏ మనిషిని ఏం సుఖపడమనయ్యా సృష్టించేవు!!



డిజైన్: యం. జయలక్ష్మి, విజయవాడ

# హంబర్ సైకిల్ సూరి అవిటికాలి సరోజ

బొంగురుపోయి వణుకుతున్న కంఠంతో మెల్లగా అన్నారు కమలమ్మగారు. "ఈ గుండెల మీద కుంపటి ఎలా దింపుకుంటానో యేమో...ఊళ్ళో అంతా గుర్లాడుతున్నారు... ఆ కన్నెచెర తప్పే యోగముపలుందో లేదో దాని మొహాన..."

తలెత్తి కమలమ్మగారి వంక చూసేను.

మామ్మగారు కళ్ళొత్తుకుంటూ చెప్ప నారంభించేరు. "అవున్నాయనా ఎంత మన పిల్ల అయినా ఆడపిల్ల అన్నాక ఏ అయ్య చేతిలో పెట్టందే శోకం పూరుకుంటుందా? పిల్ల దిందాక కిందపడిందా, "బంగారం లాటి జోడీ దాన్నేతి కిచ్చేను కాను. ధ్వంసం అయుండును" అనిపించిందే కాని మరోటి తోచలేదా క్షణం! పిల్ల ఎదుగుతున్న కొద్దీ ఆ దిక్కుమాల్న కాలు మడతపడ్డం ఎక్కువై పోతోంది అదేం ఖర్మమో. పెళ్ళై అత్తారింటికెడితే దాని సంసారం దాని కుండును, ఇద్దరు ముగ్గురు పిల్లలుండేవారి పాటికి. బినా వాఘు మాత్రమేం చేస్తాళ్ళే. ఆ మహరాజు తనదారి తను చూసుకున్నారే గాని వీడికేం మిగిల్చేరు గాదు. సవేర్తాడిన పిల్ల అన్నైనా చూడకుండా సిగ్గువిడిచి కాలేజీకంపేడు చదువు చూపయినా చేసుకుంటారేమో నని. మా రోజుల్లో పదమూడేళ్ళ పిల్లని కొండిసిగ చుట్టుకుని చెరువుకెళ్ళి స్నానం చేసి తడి బట్టలో బిందెకు నీళ్ళు ఇంటికి తెచ్చేదాన్నికనుచీకట్లో. ఓ రోజునెప్పుడో కాస్త వెలుతురొచ్చేక చెరువుకెళ్ళేనని చెప్పి మా మేనత్త "లేచిపోదామని వుందిటే రంకుముండకానా" అని నెత్తి చిల్లదేలా మొట్టింది... ఇదంతా ఎందుకు చెప్పొచ్చేను?...ఆ కాలేజీ కంపేడు. అసలు చదూకొడానికే వచ్చారాంట వెధవలు. లేకపోతే పేర్లెట్టడానికొచ్చిరా? ఇది హంసట, దీన్నడక హంస నడకట. ఈ యిల్లు మానసరోవరంట! రొడ్డమ్మట పోతూ యీలలు అరుపులూను. కుర్రదాని ఏడుపు చూశ్శేక చదువు మానిపించి సంగీతం చెప్పించేడు. వెనక ఆ స్తిపాస్తులా యేపన్నానా? నీకు తెలీందేముంది బాబూ! రెక్కలు ముక్కలేసుకుంటున్నాడు నా తండ్రి. మీ నాన్న పుణ్యమా అని ఖాదీ సంఘంలో వో దెబ్బయ్యిస్తున్నారు. ఏ పుణ్యమా అని మీ నాన్న పుచ్చుకునే ఆ యిరవయ్యే పుచ్చుకుని మా పరువు కాపాడుతున్నావు సూరిబాబూ! ఇప్పుడిది ఎంత లేదన్నా యేనభై రూపాయల బాటా-చచ్చి నీ కడుపున పుట్టాల్నుంది. బాబూ!- ఘూణాలుగిళ్ళ ప్రైవేట్లు కుదుర్చుకున్నాడు. పెట్టి సైకిలుకి తగుల్చుకుని పొరుగూళ్ళకూడా వెళ్ళి వైద్యంచేసొస్తున్నాడు పిచ్చినాగన్న! ఇదో ఇందాకట ఇవిపెల్ల వెళ్ళేడా. ఏవేళ కొస్తాడో ఏమో! అయినా ఇందరు ఇంగ్లీషు డాక్టర్లుండగా యీ ఉమాపతి పంచదార మాత్రల్లె వడికి కావాలినాయనా!...... ఎన్ని సమ్మంధాలు చూసేడనీ ఈ అయిదారేళ్ళలో! పెళ్ళిచూపుల ఖర్చంతా కలిపితే ఓ పెళ్ళి జరిపించచ్చు ఆఁ. రావడం. కాలుచూడడం. ఎనిమిదిస్తావా. పదిస్తావా అనడం. స్కూలుఫైనలు పరీక్ష యైనే మూడువేలు ఇవ్వచ్చు రివాజుప్రకారం వాళ్ళకూడా ఎనిమిది కావాలంటె ఎవడింట్లో కన్నం వేసేది. బాబూ అంతంత కట్నాలు పొయ్యడానికి?...... మూడ్రోజుల కిందటె ఒహళ్ళు చూసుకుందికి వచ్చేరు సరోజమ్మ తల్లిని. రెండో పెళ్ళే అనుకో. నాలుగేళ్ళపిల్ల ఏడాదినిండని చంటిపిల్లాడూ వున్నారుట. కాకినాడదగ్గిర ఏదో వూరుచెప్పేరు, గేపకంలేదు. కాలు స్వాంతం పరీక్ష చెయ్యాలన్నారు. నానా రభస చేసింది. పనేం వీల్లే దని. చివరికి తండ్రి మొహం చూసి సరేనంది పిచ్చితల్లి. పెళ్ళికొడుకు తల్లీ తోబుట్టువులూ గదిలోకివచ్చి పరికిణీ బాహూ మోకాలుదాటి జానెడుపై దాకా పైకి తిగించ కళ్ళ పరీక్ష చేసేరు. పెళ్ళికొడుకు పీనుగ వీడి మొహం తగలెయ్య- నా నోరు తిన్నగా రావడంలే దాక్టరీ వేసయ్యేట్ట డాక్టరీ! తనూ గుమ్మంలో నుంచుని చూసేడు కాలు. కట్నమక్కర్లేదు. కాలు నేను బాగుచేసుకుంటాను, అంటే పొంగిపోయే మనుకో. అభర్నన్నాడు గదా, ఎందరో మువ్వయిలూనలభయిలూ యిస్తామని వస్తున్నారుట పిల్ల ప్రధానంకాని డబ్బుకాదుట. పది వేలు కాలి అప్రేషనుకే అనుకుని యిచ్చేమంటే తాంబూలాలు తక్షణం పుచ్చుకోవచ్చునన్నాడు. వీడి కారుణ్యం గంగలో కలపా. వీడి ఔదార్యం గోదాట్లో కలపా!- పెళ్ళిచూపులు అవంగానే తలుపి కోటనేసి తలబాదుకుంటుంటె సరోజమ్మ. కడుపు తరుక్కుపోయిందంటె నమ్ము... నిన్నగాక మొన్న ఓ రాత్రివేళ లేచి చూస్తునుగదా నూతిదగ్గర నుంచుని నీళ్ళలోకి తొంగిచూస్తోంది .... అబోడిబోమంటూ లోపలికి లాక్కొచ్చేను ఆ పళాన... యివన్నీ చూడ్డానికే అందినాయుర్దాయం పోసుకుని బతుకుతున్నట్టున్నాను బాబూ నేను..."

గాలి స్తంభించినట్టు కొట్టుకుంది. నా ప్రాణం. పదివేల పేజీల విషాద చరిత్ర నాముందు పరచినట్టైంది. అవతల గదిలో సరోజ ఏం చేస్తుందో నేనూహించగలను. కమలమ్మగారు నూతి పళ్ళెంలో కూచుని గోలుగోలున యేడుస్తున్నారు ఎన్నాళ్ళుగా పేరుకొన్న దుఃఖమో ఈరోజు కరిగి వరదలై ప్రవహిస్తోంది గట్లు తెంచుకుని.

అంతసేపూ నాలుగు మెతుకులు కొరికి కంచంలో వేలుంచి కెలుకుతున్న నాకిక భోంచేయ బుద్ధికాలేదు. పీటమీంచిలేచి దొడ్లోకి నడిచేను.

చెయ్యి కడుక్కుంటే కమలమ్మగారు అడిగేరు -కాదు అర్థించేరు, "నీ యెరికలో సమ్మంధాలేవన్నా ఉంటే... రెండోపెళ్ళి వాళ్ళేననుకో మరీ ఏభయో పడిలో పడనివాళ్ళు..." అంతే, ఆపైన మాటలు పెగల్లేదావిడకి. ఏడుపు తోసుకుని వస్తోంది వెలుపలికి. అదే అభ్యర్థనని కన్నీట మునిగిన కళ్ళలో నిలిపి అలా నుంచుండి పోయారావిడ.

సరోజ పుట్టినప్పుడెన్ని కలలు గన్నారో! ఎన్ని ఆశలు పెంచుకున్నారో! నాలుగేళ్ళు నిండేదాకా చక్కగా ఆడుతూ పాడుతూ తిరిగిన బంగరు బొమ్మంటి పిల్లకి పోలియోవచ్చి కాలు అవిటిదై పోతే ఎంతటి దావానలాన్ని గుండెల్లో దాచుకొని, ఎన్ని కష్టాలకోర్చి ఆ పిల్లని పెంచుకొచ్చేరోగదా! ఉన్న ఒక్కగానొక్క సంతానం సరోజకి నలభైయేళ్ళ రెండోపెళ్ళి వాడికి కట్టబెట్టడానిక్కూడా సిద్ధపడుతున్నారంటే ఆ వెనుక ఎన్ని అనుభవాల ఒత్తిడి, ఏ దుష్టశక్తుల పీడన నిగూఢమై ఉన్నదో కదా!

భారమౌతున్న గుండెల నదిమి పట్టుకుంటూ "అలాగే ... తప్పకుండా చూసి చెప్తాను" అంటూ పైకి వచ్చేసేను. ఆ వాతావరణం నాకిక భరింప శక్యం గానిదై పోయింది. తలభారమైపో సాగింది మళ్ళీ...

* * *

ఊపిరాడని ఆలోచనలతో మెట్లెక్కి హాల్లోకి ప్రవేశించేసరికి ... గదిలోంచి ... వస్తూ... ఎదురైంది.

ఎవరూ...!!

సరోజ!!

నిజంగానే నాకు నోళ్ళు మండిపోయింది కోపంతో.

"ఆ కాలితో ఇన్ని మెట్లెక్కి ఎందుకొచ్చినట్టు? పక్క నే వేసుకోలేవా!" నా కంఠం నాకే కఠినంగా వినిపించింది. అంత వెర్రిగా అరిచినందుకు నొచ్చుకున్నాను. చట్టున తలుపు వెనక్కి తప్పుకుంది సరోజ.

"సరోజా కల్యాణం కథ వింటూ భోజనమే సరిగా చెయ్యలేదు మీరు- మామ్మదంతా ఖాద

స్త్రీల సౌందర్యము
దాంపత్య సుఖవృద్ధి
చర్మ వ్యాధులు

వీటి చికిత్సా వివరములకు 20 పైసల కవరుపై మీ అడ్రసు వ్రాసి పంపండి. మా చికిత్స (పై పూతకు) పొందిన స్త్రీలకు షేప్ బాడీలు, బ్రేసర్స్ వగైరా అవసరముండవు.

మంజు ఆయుర్వేద నిలయం (Regd)
శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు.1 (A.P)

స్తం — బత్తాయిపళ్ళు వొలిచి పెట్టేను. సీతాఫలాలు మీకు ప్రాణంకన్న ఎక్కువ చిన్నప్పుడు. గదిలో పెట్టేను తినండి" నెమ్మదిగా వినపడీ వినపడని స్వరంతో అంది సరోజ తలొంచుకునే.

సీతాఫలాలు తింటూ "నోట్లో ఎన్ని గింజలున్నాయో చెప్పుకో" అంటూ పందెం వేసుకుని, అవతలి వాళ్ళ సంఖ్య కరెక్టయితే రెండు గింజలు మింగేసి 'వోడిపోయేవోయ్' అంటూ గంతులేసేవాళ్ళం. ఇది గ్రహించిన వాళ్ళం 'తంతంముడి' దగ్గర కావలా కాసేవాళ్ళం. గింజ మింగితే కడిపెట్టడానికని.

తలుపు కిందనుంచి వచ్చని రెండో పాదం మీద మెత్తగా కూచున్న ఆ 'మెనగవి' కుడి పాదం కనిపిస్తోంది. ఎడమపాదం మగవాడి పాదంలా మోటుదేరి వుంది. కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా మనిషి బరువుని మోసి మోసి!

"ఊహూ 'నువ్వు' అనడం పోయి 'మీరు' అనడం ప్రారంభించేవా! చాలా బాగుంది. మర్యాదకేంలోటు చెయ్యడం లేదు కానీ. ఇంకెప్పుడూ ఇంత శ్రమ పడక నా కోసం. మెట్లమీద కాస్త ఆ కాలు మడతడితే ? వున్నదానికే అహోరాత్రాలు ఏడుస్తున్నారు కుళ్ళి కుళ్ళి. ఇకనా రెండోకాలు కూడా విరుచుకు కూర్చున్నానంటే చెప్పనక్కర్లేదు బ్రతుకు !!" అభిమానం హద్దుమీరి కోపాన్ని ఉధృతపరుస్తుంది కాబోలు! నేనేమంటున్నానో నాకే తెలీకుండా అనేశాను.

సరోజ నవ్వుతోంది.

ఎలా నవ్వగలుగుతోంది. ఇలాటి భయంకర పరిస్థితులలో నవ్వే ఆ నవ్వుకే ఏమిటర్థం?.

అమ్మపోయేక రెండుసార్లు వచ్చేను గాని సరోజ రెండు మార్లూ సెలవులకి నర్సాపురంలో వుండడం చేత నాకు చూడ్డం పడలేదు — ఇప్పుడు పరీక్షగా చూసేను. ఆ ముఖంలో పూర్వపు చిలిపితనం స్థానే గాంభీర్యం చోటు చేసుకుంది. అమాయకంగా మెరుస్తుండే ఆ కళ్ళ కింద అనుభవాలేర్పరచిన నల్లటి ముడతలు ఆవరించుకొని వున్నాయ్. ఆ చూపుల్లో విషాదం, పాలిపోయే చెక్కిళ్ళు. రెప్పల కింద నీలిమ పెదకిందుగా ఉండుండి అస్పష్టంగా కదులాడుతూ ఏదో దుర్భర వేదనను వెళ్ళగక్కే ప్రయత్నం చేస్తున్నట్టుగుపించె ఎముకలు...

భగవాన్! పచ్చగా బొద్దుగా లక్ష్మికళ ఉట్టిపడే చిన్ననాటి ఆ అందాల బొమ్మ సరోజేనా నా ఎదుట నుంచున్నది!!

రాయి మింగుతున్నట్టుగా ఒక గుటక వేసేను. బాధతో.

సరోజలో మునుపటి లావణ్యం లేదు. పెళ్ళి వయసు ముదిరిపోతోంది. పరికిణీ వోణీలు సరోజకి ఎబ్బెట్టుగా వున్నాయి. అదే చీరలోనయితే మరికాస్త బాగావుండేదేమో. కాని ఇంకా పరికిణీ వోణీలలో నే తమ సరోజను చూసుకుంటూ తెలియకపోవో ప్రలోభానికి ఆ పెద్దలు లోనయి కాలం వెళ్ళదీస్తున్నారు. అయ్యో! ఏ ధర్మాత్ముడన్నా ముందంజవేసి నా నేస్తాన్ని చేపట్టరాదా? ఏ ఆదర్శ యువకుడన్నా నా సరోజ మెడలో తాళి గట్టి క్రుంగిపోయే ఆ అభాగ్యజీవులను ఆనంద సాగరంలో ఓలలాడించ గూడదా? ఒక్కరంటే ఒక్కరు ముందుకి రాకూడదా? ... వస్తారు. రాకపోరు. వచ్చేరు. వస్తూనే ఉన్నారు కూడా. కాని ఆ "మహానుభావుల" ధనదాహాన్ని తీర్చగల తాహతు రఘుపతిగారికి లేదుమరి! అదాయన తప్పుకాదు. దేవుడాయనకి ఆస్తిపాస్తులీయలేదు — ఆడపిల్లనిచ్చేడు. ఆ పిల్లకి అందచందాలనిచ్చేడు— అవిటికాలినికూడా యిచ్చేడు. ఎంత "యాన్టీ డౌరీ" బిల్లు పాసయినా మధ్యతరగతి నికృష్ట జీవులగతి అధోగతిగానే ఉండిపోతుంది. ప్రభుత్వం శాసనాలంటే చేస్తుందిగాని మనిషిలో సంస్కారం పెంపొందించగలదా! మానవత్వాన్ని "మాను ఫేక్చర్" చేయగలదా! అన్నీ సవ్యంగావున్న పిల్లలకే పెళ్ళిచెయ్యడం బ్రహ్మవిద్యగా పరిణమిస్తున్న ఈ తెలుగునాట అవకరం కలిగిన ఈ నా బాల్య స్నేహితురాలికి పెళ్ళవడమంటే మాటలా?

—అందుకే సరోజ నవ్వు స్వచ్ఛంగా, నిర్మలంగా లేదు. అందు వైరాగ్యపు ఛాయలే విస్తృతంగా కనిపిస్తున్నాయి.

నవ్వేశం ఆపి అంది సరోజ: రెండోకాలేనా, విరగనీండి! విరిగితే అప్పుడు నన్ను "కోడియాన" అనో "బాతుయాన" అనో పిలువవచ్చు అన్నట్టు మరిచేను. నా రెండోకాలుకూడా విరిగిపోతే నాలో "సిమెట్రీ" ఏర్పడుతుంది. నేగనక మళ్ళీకాలేజీలో చేరితే సోదర విద్యార్థి పుంగవులు, భావి భారత పౌరులు పూర్వం తమ సీనియర్స్ నన్ను "కుంటి హంస" అని పిలువక పోవడంతో దద్దమ్మలని నిరూపించుకున్నారనీ. రెండు అవిటికాళ్ళతో నిజంగా ఇప్పుడే నేను "హంస" నడుదానికి అర్హురాలననుకునీ పొంగిపోక మానరు."

విభ్రాంతితో చలించేను. సరోజేనా ఇంత దిగజారిపోయింది, నిరాశా పూరితంగా ఇన్నిమాటలు మాటాడుతున్నదీ!

"మీకు భయమనవసరం. కిందపడితే నాకు ఏమన్నా అవుతుందని ఇంత ప్రయాణంచేసి అలసివున్న మిమ్మల్ని అర్ధాకలితో పడుకోనివ్వమంటారా!—అమ్మకి ఇబ్బోపీలియా. మామ్మకి కన్నగుపించదు. నాన్న జనిపిల్ల వెళ్ళేరు. ప్రస్తుతం ఈ యింట్లో నేనే ఛాంపియన్ని — పడితే మహాఅయితే ప్రాణంపోతుంది. అంతేగదా: అదన్నా అంత సులువుగా లభ్యమౌతుందా ఈ నిర్భాగ్యురాలికి,"

రెండు తలుపుల మధ్యనపెట్టి నా తలనెవరో బలంగా నొక్కుతున్నట్టైంది నాకు— నిండు యవ్వనంలోనున్న ఈ సరోజ ఇంత వైరాగ్య దృష్టి నలవరచుకోడానికి ఏ దుష్టశక్తులు దోహదం చేశాయో!

భగవంతుడు శుద్ధ స్వార్థపరుడు. తరింపసాధ్యంకాని దుఃఖ సముద్రంలో అమాయకపు జీవులకు తలమునకలు చేసి తద్వారా తనఉనికిని పటిష్ఠం చేసుకుంటాడులావుంది!

ఏర్పడిన బరువును తొలగించే ఉద్దేశంతో మాట మార్చేను. "సరోజాదేవిగారూ, తమరు నన్ను 'మీరు' 'మీరు' అనడం మానకపోతే తమరింట నేనిక అన్నం ముట్టనని మనవి చేసుకుంటున్నాను. ప్రార్థన మన్నించమని వేడుకుంటున్నాను" అంటూ.

అదిగో! సరోజ నవ్వింది. చిన్ననాటి సరోజలా స్వచ్ఛంగా నవ్వింది కిలకిలమని. ఆ నవ్వుతో పూర్వపు అందాలన్నీ ఒకటొకటిగా వచ్చి చేరుకున్నాయని పించింది ఆ ముఖంలో. చూపులో విషాదం మాయమై చెక్కిళ్ళు ఎర్రనయ్యాయి.

"ఈ వేళ్టికిక అన్నం ముట్టమని ఎవరూ బలవంతం చేయటంలేదుగాని, మీరుపడుకునేముందు ఫలహారం చేసి మరీ పడుకోండి" అంది నవ్వు తోసుకుని వస్తుండగా పైట నోటికడ్డంపెట్టుకుని.

గదిలో లైటు వేసింది. అప్పుడు చూసేను సరిగా. మంచంవాల్చి తెల్లగా పక్కవేసి వుంది. పక్కగా బల్లమీద గ్లాసుతో మంచినీళ్ళున్నాయి. పళ్ళెంలో కళ్ళు విప్పుకుని నాకోసం నిరీక్షిస్తున్న సీతాఫలాలు. తొనలు వొలిచి ముత్యాలు పోగుగా పెట్టిన బత్తాయిలు. పొందికగా పళ్ళెంలో అమర్చి ఉన్నాయి. ఈ యింట ప్రతి వ్యక్తికీ నాపై ఎంత అభిమానం! నా కళ్ళు ఆనందంతో చెమర్చేయి.

/ ఇంకావుంది /

ఇంటికి దీపం కంటికి వెలుగు
"ఆంధ్రజ్యోతి"
సచిత్ర వారపత్రిక చదవండి!

పం.డి.తి.డి. గోపాలాచార్యులవారి
అరుణా
స్త్రీల ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100, జి. ఎస్. రోడ్ మదరాసు 17